




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 261 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 26 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :261 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 26 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## పోక్సో కేసులో దోషికి రెండు మరణ-శిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

- తమిళనాడులో కీలక తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు
- విద్యార్థినిపై అత్యాచారం, అతి దారుణంగా హత్య
- అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో 12వ తరగతి విద్యార్థిని హత్యా చారం కేసులో దోషికి రెండు మరణశిక్షలను విధిస్తూ పోక్సో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. విలాతికుళం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినిపై ధర్మ మునీశ్వరన్ అనే వ్యక్తి అత్యాచారం

- మిగతా 2లో

## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు



- కమీషన్ల కోసం జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధించిందన్న అచ్చెన్నాయుడు
- నాకెంత.. నీకెంత అంటూ దోచుకున్నారని విమర్శ
- కూటమి ప్రభుత్వంలో రూ. 23 లక్షల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉండగా

- మిగతా 2లో

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి



- గోదావరి పుష్కరాలపై రాజమండ్రిలో పవన్ సమీక్ష
- రూ. 8,600 కోట్ల పనులకు డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం
- వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే ఈ మహత్తర

- మిగతా 2లో



## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై స్పందించిన మల్లికార్జున ఖర్గే

- దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందన్న ఖర్గే
- రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్న
- సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి ప్రభుత్వం పెట్రోల్ జల్లుతోందని విమర్శ

- మిగతా 2లో



## ఇంధన ధరల పెంపు.. ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం:

- పన్నులు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టమన్న నిర్మల
- '3-ఎఫ్' అంశాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న మంత్రి
- భయాందోళనలు సృష్టించొద్దంటూ రాహుల్ గాంధీకి పరోక్ష కౌంటర్

పెన్ పవర్ డెస్క్:దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడిం చారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు

- మిగతా 2లో

## చిప్ నుంచి షిప్ వరకు... ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం



- టెక్నాలజీతో ఏపీని వేగంగా ముందుకు తీసుకెళతామన్న సీఎం చంద్రబాబు
- అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం
- 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వెల్లడి
- చిప్ నుంచి షిప్ వరకు తయారీపై దృష్టి సారించామని స్పష్టం

- మిగతా 2లో

### కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్..

## పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

- ఎస్ఐఆర్ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చిన కేటీఆర్
- డూప్లికేట్ ఇట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే నగరంలో 24 గంటల పాటు తాగునీరు ఇస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

- మిగతా 2లో





## ఎడిటర్ వ్యూ

# చిప్ నుంచి షిప్ వరకు...
# ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం

టెక్నాలజీని అనుసంధానం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని, యువతకు అపార అవకాశాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీపై ఆధారపడి ఉందని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా మారుస్తామని, క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. యువత, విద్యాసంస్థలు ఈ నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నాన్ని ప్రపంచానికే డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. స్టీల్, అల్యూమినియం, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి నుంచి బెంగళూరు వరకు డిఫెన్స్ కారిడార్‌గా, రాయలసీమను రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల టెస్టింగ్ ఫెసిలిటీని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యలంక, గండికోట వంటి పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, పరిశ్రమలు వాస్తవ రూపంలో కార్యకలాపాలు ప్రారంభించేలా చూస్తున్నామని, 'సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని పునరుద్ఘాటించారు. గత 23 నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయం తర్వాత అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల పాలసీలను తీసుకొచ్చామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంగా పనిచే స్తున్నామని, ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా మహిళలను పారిశ్రా మికవేత్తలుగా మారుస్తామని ప్రకటించారు. రాష్ట్రం నుంచి 100 యునికార్న్ సంస్థలను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కళావేదికను ప్రారంభించిన సీఎం**

అంతకుముందు, విజయవాడలో 4.4 ఎకరాల విస్తీర్ణంలో 1.45 లక్షల చదరపు అడుగుల స్థలంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇలాంటి మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లను నిర్మిస్తామని ఈ వేదికగా సీఎం హామీ ఇచ్చారు.

# ఇంధన ధరల పెంపు.. ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం:

- మొదటి పేజి తరువాయి

పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు.

**రాహుల్‌కు పరోక్ష కౌంటర్**

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే.

**'3-ఎఫ్' ఫార్ములా**

పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3-ఎఫ్' (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ - ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.

**భయాందోళనలు వద్దు**

ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై స్పందించిన మల్లికార్జున ఖర్గే

అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తున్నాయి. ఈరోజు మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీంతో లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలు గత రెండు వారాల్లో పలుమార్లు పెరిగాయి. దీంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12, లీటర్ డీజిల్ రూ.95.25గా, హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది. పెట్రోల్, డీజిల్ పెరుగుదలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయని మండిపడ్డారు. 2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41గా ఉంటే ఇప్పుడు రూ.102.12కు చేరుకుందని గుర్తు చేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీపీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు పెరిగినట్లు చెప్పారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

# పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు


- మొదటి పేజి తరువాయి

చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా అతి దారుణంగా ప్రవర్తించినందుకు గానూ ఈ శిక్షలు విధిస్తున్నట్లు తెలిపింది. దీనిని అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు, గతంలోనూ పలు నేరాల్లో అతడికి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది. విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన పన్నెండో తరగతి చదువుతున్న విద్యార్థిని మార్చి 10వ తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు వేదనాథం అటవీ ప్రాంతంలో తీవ్ర గాయాలతో విగతజీవిగా కనిపించింది. తాము ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు.

ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులు స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మార్చి 19న నిందితుడిని అరెస్టు చేశారు. అతడు గతంలోనూ ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినిపై హత్యాచారం జరిగిన సమయంలో అతడు బెయిల్‌పై బయట ఉన్నాడు

# బాదంపప్పు బాగోతాలు -3

- జీవో రాకముందే ఇనాం భూముల ఆన్‌లైన్ ఎలా సాధ్యం..?
- తాడేపల్లిగూడెం--పెంటపాడు భూ సెటిల్మెంట్ల వెనుక "బాదంపప్పు--ఎమ్మార్వో" లింక్ ఏంటీ..?
- జీవోకు ముందే ఇనాం భూముల ఆన్‌లైన్ ఎలా జరిగింది..?
- తాడేపల్లిగూడెంలో లంచాల వసూళ్లతో భారీ భూ దందా జరిగిందా..?
- పెంటపాడు మండలంలో జరిగిన రిజిస్ట్రేషన్ల వెనుక అసలు మాస్టర్‌మైండ్ ఎవరు..?
- "బాదంపప్పు" సెటిల్మెంట్ చెప్పితే... ఎమ్మార్వో ఆన్‌లైన్ చేసేవాడా..?
- భూముల వివాదాల్లో పోలీస్--రెవెన్యూ నెక్సస్‌పై పెరుగుతున్న అనుమానాలు..!
- రాష్ట్ర ప్రభుత్వ జీవో రాకముందే కోట్ల విలువైన ఇనాం భూములు చేతులు మారాయా..?




**ఎడిటర్, పెన్ పవర్ భీమవరం /తాడేపల్లిగూడెం మే 25:** ?రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న భూ కుంభకోణాల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇనాం భూముల క్రమబద్ధీకరణ లేదా ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన జీవో వెలువడక ముందే.. ఇక్కడ కోట్ల రూపాయల విలువైన భూములు ఆన్‌లైన్ అయిపోయాయి! ప్రభుత్వ ఆదేశాలు లేవు, ఉన్నతాధికారుల అనుమతులు లేవు.. కానీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం భూముల స్వరూపం మారిపోయింది. అసలు జీవో రాకముందే ఈ ఇనాం భూములను ఆన్‌లైన్ లోకి ఎలా ఎక్కించారు? దీని వెనుక నడిచిన రహస్య శక్తులు ఏవి? అనే కోణంలో 'పెన్ పవర్' లోతుగా పరిశీలించగా విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి.

**తాడేపల్లిగూడెంలో లంచాల వసూళ్లతో భారీ భూ దందా జరిగిందా..?**

?తాడేపల్లిగూడెం మండలంలో గత కొంతకాలంగా సాగిన భూ దందా వెనుక భారీ స్థాయిలో లంచాలు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివాదాస్పదంగా ఉన్న ఇనాం భూములను క్లియర్ చేసేందుకు, వాటిని ప్రైవేటు వ్యక్తుల పేరిట ఆన్‌లైన్ చేసేందుకు ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ పనిచేసినట్లు తెలుస్తోంది. ఎకరాకు ఇన్ని లక్షలు అంటూ రేట్లు ఫిక్స్ చేసి, మధ్యవర్తుల ద్వారా కోట్ల రూపాయల వసూళ్లకు తెరలేపినట్లు స్థానికంగా గట్టి ప్రచారం సాగుతోంది. ఈ లంచాల పర్వం వెనుక ఒక పక్కా ప్లాన్ ప్రకారం ప్రభుత్వ భూములను, ఇనాం భూములను ప్రైవేటు వ్యక్తుల పరం చేశారనే ఆరోపణలు ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

**పెంటపాడు మండలంలో జరిగిన రిజిస్ట్రేషన్ల వెనుక అసలు మాస్టర్‌మైండ్ ఎవరు..?**

ఈ అక్రమ భూ దందా కేవలం తాడేపల్లిగూడెం మండలంతోనే ఆగిపోలేదు. దీని సెగ పక్కనే ఉన్న పెంటపాడు మండలానికి కూడా పాకింది. పెంటపాడు మండల పరిధిలో కూడా భారీ ఎత్తున ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి లీగల్ క్లియరెన్స్ లేని భూములకు కూడా చకచకా రిజిస్ట్రేషన్లు ఎలా జరిగిపోయాయి? రిజిస్ట్రేషన్ల శాఖను, రెవెన్యూ శాఖను వెనకుండి నడిపించిన ఆ 'మాస్టర్‌మైండ్' ఎవరు?

తెర వెనుక ఉండి చక్రం తిప్పిన ఆ అదృశ్య హస్తం ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారాయి.

**"బాదంపప్పు" సెటిల్మెంట్ చెప్పితే... ఎమ్మార్వో ఆన్‌లైన్ చేసేవాడా..?**

ఈ మొత్తం వ్యవహారంలో అప్పటి తాడేపల్లిగూడెం/ ప్రస్తుత పెంటపాడు ఎమ్మార్వో, సునీల్ పాత్రపై తీవ్ర స్థాయిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన హయాంలోనే ఈ భూముల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. అయితే, ఇక్కడే ట్విస్ట్ ఏంటంటే.. ఈ కథలో "బాదంపప్పు"గా పేరుగాంచిన ఒక కీలక పోలీస్ అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది!

**ఇన్సైడ్ టాక్:**

స్థానిక వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. భూ వివాదాలు, ఇనాం భూముల సెటిల్మెంట్ల విషయంలో ఈ "బాదంపప్పు" అనే అధికారి రంగంలోకి దిగేవారని సమాచారం.

ఆయన స్టేషన్ పరిధి దాటి, సివిల్ వివాదాల్లో తలదూర్చి సెటిల్మెంట్లు చేసేవారని టాక్. "బాదంపప్పు" గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, సెటిల్మెంట్ ఓకే అని చెబితే చాలు.. అప్పటి ఎమ్మార్వో సునీల్ వెనకా ముందు చూసుకోకుండా రికార్డులను ఆన్‌లైన్ చేసేవారనే ప్రచారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**భూముల వివాదాల్లో పోలీస్--రెవెన్యూ నెక్సస్‌పై పెరుగుతున్న అనుమానాలు..!**

సాధారణంగా భూ వివాదాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయి. శాంతిభద్రతల సమస్య వస్తే తప్ప పోలీసులు ఇందులో జోక్యం చేసుకోకూడదు. కానీ, తాడేపల్లిగూడెం, పెంటపాడు పరిధిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. పోలీస్ అధికారి "బాదంపప్పు", రెవెన్యూ అధికారి ఎమ్మార్వో సునీల్ ఇద్దరూ చేతులు కలిపి ఒక అపవిత్ర కూటమిగా (నెక్సస్) ఏర్పడ్డారనే అనుమానాలు బలపడుతున్నాయి. ఎవరైనా భూమి వివాదాలతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కితే.. అక్కడ "బాదంపప్పు" తన స్టైల్ లో ఒత్తిడి తెచ్చి, ఆపై రెవెన్యూ వ్యవస్థను లూప్ లోకి తీసుకుని రికార్డులు మార్పించేవారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రభుత్వ ఆస్తులను, ఇనాం భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ఈ పోలీస్-రెవెన్యూ నెక్సస్ పనిచేసిందనే వాదనలకు బలం చేకూరుతోంది.

**ప్రభుత్వ జీవో రాకముందే కోట్ల విలువైన ఇనాం భూములు చేతులు మారాయా..?**

చట్ట ప్రకారం ఇనాం భూములపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు ( జీ ఓ) రావాలి. కానీ ఇక్కడ ప్రభుత్వ జీవో కంటే ముందే రికార్డులు మారిపోయాయి, రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి, కోట్ల విలువైన భూములు యజమానులను మార్చేసుకున్నాయి!

ఈ మహా భూ భాగోతంపై ఇప్పుడు ప్రజలు, బాధితులు ముక్తకంఠంతో కొన్ని ప్రశ్నలను సంధిస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవో రాకుండానే కోట్ల విలువైన ఇనాం భూములు ఆన్‌లైన్ లోకి ఎలా వచ్చాయి? సాంకేతిక వ్యవస్థను ఎలా మేనేజ్ చేశారు?

ఒక సివిల్ వివాదంలో, ఇనాం భూముల క్లియరెన్స్ లో పోలీస్ అధికారి "బాదంపప్పు" జోక్యం ఏంటి? ఆయనకు, రెవెన్యూ అధికారులకు ఉన్న సంబంధం ఏంటి?

ఈ అక్రమ ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్ల వెనుక లంచాల రూపంలో ఎన్ని కోట్లు చేతులు మారాయి? ఈ సొమ్ము ఎవరెవరి జేబుల్లోకి వెళ్ళింది?

**చివరిగా :**

తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో జరిగిన ఈ ఇనాం భూముల అక్రమ ఆన్‌లైన్ వ్యవహారంపై కేవలం శాఖాపరమైన విచారణ సరిపోదని. దీని వెనుక పెద్ద తిమింగలాలు ఉన్నాయని, కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విజిలెన్స్ మరియు ఏసీబీ అధికారులతో సమగ్ర ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన ఎమ్మార్వో సునీల్, సదరు బాదంపప్పు (పోలీస్ అధికారి) పై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు!

**ఎపిసోడ్ 13**

**బాదంపప్పు ఆస్తులు చిట్టా వింటే నోర్లు వెళ్ళబెట్టాల్సిందేనా..?**
**బంధువుల పేరు మీద ఎక్కడెక్కడ ఎంత ఆస్తులు కూడ బెట్టాడు..?**
**లాకర్ లలో ఉన్న ఆ బంగారులక్ష్మీ విలువ ఎంత ..?**
**సర్వీసులోకి వచ్చేటప్పటికీ బాదంపప్పు ఆస్తి ఎంత..?**
**ఇప్పుడు బాదంపప్పు ఆస్తి ఎంత..?**
**చదువుతూనే ఉండండి క్రైమ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలు తలపించే బాదంపప్పు కథలు**

# 'ఇంకా పాఠాలు నేర్చుకోలేదు'..
## నీట్ పేపర్ లీక్‌లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం!

- మొదటి పేజి తరువాయి

పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని ఫైమా, యూడీఎఫ్ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. లోపభూయిష్టంగా మారిన ఎన్‌టీఏ స్థానంలో సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని లేదా దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోర్టును కోరారు. నీట్ యూజీ పరీక్షలను కట్టుదిట్టంగా, స్వతంత్రంగా నిర్వహించేలా ఒక పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో డిమాండ్ చేశారు.

**మూడు రోజుల్లో అఫిడవిట్**

గత నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత పరీక్షల పర్యవేక్షణ కోసం కోర్టు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. గతేడాది నవంబర్ 14న ఏర్పాటైన ఈ మానిటరింగ్ కమిటీ చేసిన సిఫార్సులను ఎంతవరకు అమలు చేశారో స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఎన్‌టీఏను ఆదేశించింది. ఈ కమిటీకి నేతృత్వం వహించిన జస్టిస్ రాధాకృష్ణన్ కూడా సిఫార్సుల అమలుపై తీసుకున్న చర్యలను కోర్టుకు వివరించాల్సి ఉంటుంది. ఈ అఫిడవిట్లను మూడు రోజుల్లోగా సమర్పించాలని గడువు విధించింది.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి

- మొదటి పేజి తరువాయి

ఆధ్యాత్మిక వేడుకకు ఇప్పటివరకు సరైన సన్నద్ధత కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.8,600 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులకు ఇప్పటికీ డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాగితాలపై ప్రణాళికలు కాకుండా క్షేత్ర స్థాయిలో పనులు కనిపించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో సీఎం చంద్రబాబుకు వివరించాలని అధికారులను ఆదేశించారు. సరైన ప్రణాళిక లేకుండా ఒకే ఏడాదిలో 7 వేల పనులు హడావుడిగా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని పవన్ హెచ్చరించారు. "పాడైపోయిన సిమెంట్‌తో పనులు చేసి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది, స్పష్టమైన డేటా లేకుండా అడిగితే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వదు" అని స్పష్టం చేశారు. గత పుష్కరాల తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా, ఆరు జిల్లాల్లోని 274 పంచాయతీల వరకు ఏర్పాట్లు విస్తరించాలని, గోదావరి కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశాన్ని త్వరలోనే కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పుష్కరాల నిధుల సమీకరణలో పవన్ కల్యాణ్ ఆశాకిరణంలా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

- మొదటి పేజి తరువాయి

'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించి ఉక్కు పరిశ్రమను కాపాడారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించామని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల స్థాపన అవసరమన్న ఆయన... నియోజకవర్గ తాగునీటి సమస్యకు రూ.620 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రజల 60 ఏళ్ల కల అయిన 'నేరడి బ్యారేజీ'ని 2029 నాటికి వంద శాతం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్, బీజేపీలు నమోదు చేయిస్తున్న దొంగ, డూప్లికేట్ ఓట్ల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్క ఓటరును కోల్పోకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటల పాటు నిరంతరం తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో తెలంగాణకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని, అదే రీతిలో నగరానికి నిరంతర మంచి నీరు అందించేది కూడా కేసీఆరేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మార్కు పరిపాలనపై పూర్తి అవగాహన ఉండబట్టే, నగర ప్రజలు గత ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలను ఇప్పుడు కాంగ్రెస్ నేతలు ఓపెన్ చేస్తూ... తామే కట్టామంటూ అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని, అయితే ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# మూగజీవాలను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించం..!

హుకుంపేట సీఐ విజయ్ కుమార్

**హుకుంపేట పెన్ పవర్ మే25** : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జంతు సంరక్షణ చట్టాలు అక్రమ పశువు రవాణా నియంత్రణ జంతువులపై క్రూరత్వం నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లుగా హుకుంపేట సీఐ విజయ్ కుమార్ తెలిపారు గౌరవ హైకోర్టు అలాగే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బక్రీద్ పండగ సందర్భంగా అక్రమ పశువుల రవాణా చట్ట విరుద్ధ కార్యకలాపాలపై కఠిన నిఘా ఏర్పాటు చేశామని ప్రధాన రహదారులు సరిహద్దుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు పశువుల అక్రమ రవాణా సమయంలో రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎవరైనా చట్ట విరుద్ధంగా పశువులను అక్రమ రవాణా చేస్తే తక్షణమే హుకుంపేట సీ.ఐ విజయ్ కుమార్ ఫోన్ నెంబర్ 9281442989 కు సమాచారం



అందించాలన్నారు ప్రజలు శాంతి భద్రతాల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు

## శునకాల దాడికి గాయాల పాలైన బాలుడికి ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత



**కూర్మాన పాలెం: పెన్ పవర్,మే25**:జీవీఎంసీ 86వ వార్డు పరిధిలోని దువ్వాడ ఫేస్ టు పార్కులో వారం రోజుల కిందట శునకాల దాడి వలన తీవ్ర గాయాలతో రెయిన్బో పిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 2 లక్షల 25 వేల రూపాయల మంజూరు చేశారు. దీనికి సంబంధించిన పత్రాన్ని వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆయన చేతులమీదుగా బాలుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీఅధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారన్నారు. ఆసుపత్రిలో తక్షణ ఖర్చు నిమిత్తము 25 వేల రూపాయలు తన సొంత నిధులను బాలుడి కుటుంబానికి అందజేశారని తెలిపారు. ఆసుపత్రిలో పల్లా శ్రీనివాసరావు బాలుడిని పరామర్శించినప్పటి నుండి బాలుడికి అయ్యే వైద్య ఖర్చు నిమిత్తము ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం తీవ్ర కృషి చేశారన్నారు. బాలుడికి అత్యుత్తమ వైద్యం అందించే విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో సహాయపడుతుందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన మహానాడు కార్యక్రమం ఉన్నప్పటికీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి కావలసిన సహాయక చర్యలను అందిస్తూ వైద్యసేవల ఖర్చు నిమిత్తం సీఎం సహాయ నిధి నుండి సహకారం అందించడం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్వచ్ఛమైన సేవకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాస్, నాయకులు జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ కమిషనర్ గారు.. ఈ అక్రమ యూసీకి మీ వాటా ఎంత?



- ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం.. అధికారుల మౌనం ఎందుకు?
- అనుమతి మూడు అంతస్తులకు..అదనంగా మరో అక్రమ యుసి నిర్మాణం!
- “అక్రమ యూసీ”ల నుంచి లక్షల్లో వసూళ్లు!
- కింద స్థాయి ఉద్యోగులను అధికారులను బెదిరిస్తున్న బిల్డర్!
- పెందుర్తి జోన్‌లో “అక్రమల రాజ్యం” నడుస్తుందా?

**పెందుర్తి, పెన్ పవర్, మే 25 :** స్థానిక పెందుర్తి జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజల భద్రత, పట్టణ ప్రణాళిక నిబంధనలను కాపాడాల్సిన అధికారులే నిబంధనలను పక్కనపెట్టి అక్రమ నిర్మాణాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పెందుర్తి జోనల్ కమిషనర్ వ్యవహార శైలిపై స్థానికులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ వార్డ్ నెం.72, ప్రస్తుతం జీవీఎంసీ 93 వార్డ్, గొల్ల నారాయణపురం, సింహాచలం రోడ్, బృందావనం లాడ్జ్ వెనుక జరుగుతున్న యూసీ నిర్మాణం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. స్థానికుల ఆరోపణల ప్రకారం, అనుమతి పొందిన ప్లాన్‌కు పూర్తి విరుద్ధంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సెట్బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించడం, అనుమతి లేని సైడ్ మెట్లు నిర్మించడం, అదనపు అంతస్తులు వేయడం వంటి అంశాలు బహిరంగంగానే కనిపిస్తున్నప్పటికీ, అధికార యంత్రాంగం మాత్రం కళ్లు మూసుకుని కూర్చుందని స్థానికులు మండిపడుతున్నారు. స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్ల వరకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, అదనంగా మరో అనాథరైజుడ్ అంతస్తు నిర్మాణం కొనసాగుతోందని తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇది కేవలం చిన్న నిబంధనల ఉల్లంఘన కాదు.. పూర్తి స్థాయి అక్రమ నిర్మాణమని స్థానికులు చెబుతున్నారు. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ నిర్మాణానికి ఆధారంగా చూపుతున్న బిఏ నెంబర్ 1086/1660/వి/కెడ్ 6/ఈజీఈ/2020 ప్లాన్ కాలపరిమితి ముగిసిపోయిందని సమాచారం. అయినప్పటికీ అదే ప్లాన్‌ను చూపిస్తూ నిర్మాణం కొనసాగించడం వెనుక ఎవరి ఆశీర్వాదం ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు మరింత సంచలనంగా ఉన్నాయి. అక్రమ యూసీలను అడ్డుకోవాల్సిన కొందరు అధికారులు, వాటి నుంచే లక్షల్లో వసూళ్లు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. అందుకే ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రత్యేకంగా జోనల్ కమిషనర్ పాత్రపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. “ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమి చేస్తున్నారు?”, “ఎవరికి భయపడి మౌనం వహిస్తున్నారు?”, “అక్రమాలకు అండగా నిలుస్తున్నది ఎవరు?” అనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో మరో కీలక అంశం కూడా వెలుగులోకి వచ్చింది. సచివాలయం స్థాయి ప్లానింగ్ అధికారుల పేర్లు ప్రస్తావిస్తూ, తనను పరిశీలించడానికి వచ్చిన వారినే బిల్డింగ్ యజమాని వెనక్కి పంపించాడనే ఆరోపణలున్నాయి. అంటే సాధారణ ప్రజలకే కాదు, అధికార యంత్రాంగానికే సవాల్ విసురుతున్న స్థాయికి పరిస్థితి చేరిందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. పట్టణ ప్రణాళిక చట్టాలు ప్రజల భద్రత కోసం ఉంటాయి. కానీ పెందుర్తి జోన్‌లో మాత్రం అవే చట్టాలు కొందరి కోసం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ యూసీలు, అదనపు అంతస్తులు, సెట్బ్యాక్ ఉల్లంఘనలు, గడువు ముగిసిన ప్లాన్లు ఇవన్నీ అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఉన్నతస్థాయి విచారణ జరగాలి

ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర ఉన్నతస్థాయి విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణానికి సహకరించిన అధికారులు, నిబంధనలు ఉల్లంఘించిన బిల్డర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిర్మాణాన్ని నిలిపివేసి, పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పెందుర్తి జోన్‌లో జరుగుతున్న ఈ ఘటన కేవలం ఒక అక్రమ నిర్మాణం కథ కాదు.. నగర పాలనలో పారదర్శకత, అధికారుల బాధ్యత, చట్టాల అమలు అన్నింటిపైనా పెద్ద ప్రశ్నార్థక చిహ్నంగా మారింది.

# సూర్య ఘర్ సోలార్ ప్లేట్ల ఏర్పాటులో బలవంతపు వసూళ్లు..?

తక్షణమే చర్యలు తీసుకోవాలి

వైసీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు వసపరి తిమాతి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మే 25:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్తవీధి మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గిరిజనులు నిర్మించుకున్న స్లాబ్ ఇళ్లలో ఏర్పాటు చేస్తున్న సూర్యఘర్ సోలార్ ప్లేట్ల నిర్మాణ పనుల్లో బలవంతపు వసూళ్లు జరుగుతున్నాయని జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు వసపరితిమాతి ఆవేదన వ్యక్తం చేశారు. పెదవలస పంచాయతీలో తమ గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో సోలార్ ప్లేట్లు బిగించడానికి వచ్చిన వ్యక్తులకు స్వయంగా భోజనాలు ఏర్పాటు చేసినప్పటికీ, సోలార్ ప్లేట్లు బిగించిన ప్రతి గృహం నుంచి రూ. 300 చొప్పున వసూలు చేశారని తెలిపారు. 300 రూపాయలు ఎందుకు ఇవ్వాలి అని అంటే సర్వీస్ ఛార్జ్ అని అంటున్నారని తెలిపారు. అలాగే లబ్ధిదారులే స్వయంగా సిమ్మెంటు,కంకర, ఇసుక తెచ్చుకుని సోలార్ ప్లేట్లు కింద దిమ్మలు వేసుకోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ పథకం పూర్తిగా ఉచితమని ప్రకటించిన నేపథ్యంలో ఈ విధంగా డబ్బులు వసూలు చేయడం సరైంది కాదన్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రుసుములు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ విషయమై చింతపల్లి ఎలక్ట్రికల్ ఏఈఈ ప్రభాకర్ ను వివరణ కోరగా లబ్ధిదారులు ఎట్టి పరిస్థితుల్లో సోలార్ బిగించడానికి వచ్చిన వారికి డబ్బులు ఇవ్వరాదని ఈ విషయమై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పరిశ్రమలతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- పరిశ్రమల వాడగా ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్క్ అభివృద్ధి
- ప్రతీ నియోజక వర్గంలో పరిశ్రమలు స్థాపన ప్రభుత్వ లక్ష్యం

**టెక్కలి, పెన్ పవర్ మే 25:** రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని 12 ఎకరాల విస్తీర్ణంలో అంచనా వ్యయం రూ. 10.51 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎం ఎస్ ఎం ఈ పార్క్ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో దశలవారీగా ఎం ఎస్ ఎం ఏ పార్కులు అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగా జిల్లాలోని టెక్కలి, ఆముదాలవలస, ఇచ్ఛాపురం, నరసన్నపేట నియోజవర్గాలలో ఎం ఎస్ ఎం ఈ పార్కులను అమరావతి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 12 ఎకరాల్లో భూమిని 74 ఫ్లాట్ గా చదును చేసి రహదారులు, విద్యుత్తు, తాగునీటి, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి జిల్లాలో ప్రధానమైన ఎంఎస్సీ పార్కుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ఎంఎస్ఎమ్ఈ పార్క్ కు నలు దిక్కులా రహదారుల సౌకర్యం ఉన్నందున పారిశ్రామిక వాడగా రూపొందించనున్నట్లు స్పష్టం చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, గ్రామాల్లో మౌలిక వసతులకు అవకాశం లభించి రాష్ట్రాలు ప్రగతి పదంలో పయనిస్తాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం సహకారంతో 12వేల కోట్లు నిధులు కేటాయించి పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు భారం మూడు వేల కోట్లు ప్రభుత్వం భరించి విశాఖ ఉక్కు పరిశ్రమను నిలబెట్టామన్నారు. అనుభవజ్ఞుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్, మంత్రి పవన్ కళ్యాణ్ భావితరాల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులను ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థలకు నమ్మకం కల్పించి గూగుల్ డేటా సెంటర్, స్టీల్ ప్లాంట్ వంటి భారీ పరిశ్రమలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావడంలో అంబాసిడర్ గా నిలిచారన్నారు. ఇటీవల పాయకరావుపేటలో లక్షా 50 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని పరిశ్రమల కోసం రెండు మాసాల్లో ఐదువేల ఎకరాల భూమి ఇచ్చేందుకు ప్రజలు సహకరించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగుల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికతో కృషి చేస్తుందన్నారు . యువతను, స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పార్కులను ఏర్పాటు చేస్తుందన్నారు. జిల్లాలో నేరెడి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులన్నీ తొలగాయని, ముఖ్యమంత్రి ప్రాధాన్యతనిచ్చి రానున్న ఏడాదిన్నర లోగా నేరేడి బ్యారేజ్ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నారని వెల్లడించారు.



### పరిశ్రమల ఏర్పాటుకు ప్రజల సహకారం అవసరం

పరిశ్రమల ఏర్పాటుకు ప్రజలు ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. పరిశ్రమలకు భూములు ఇచ్చిన లబ్ధిదారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయోజనాలు కల్పిస్తుందని మంత్రి భరోసానిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిశ్రమల కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రజలు మద్దతునిస్తేనే పారిశ్రామిక వేత్తలు వస్తారని, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, కళింగ వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, కోటబొమ్మాళి పీ ఏ సి ఎస్ అధ్యక్షులు వెలమల విజయ లక్ష్మీ, ఏపీ ఐఐసి జోనల్ మేనేజర్ వి. కృష్ణ ప్రసాద్,ఆర్డీవో ఎమ్.కృష్ణ మూర్తి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం. సుధాకర్, తహసీల్దార్ ప్రసాద్, ఎమ్ పీ డీ ఓ ఫణేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నెలవరి తినిఖీ భాగంగా ఈవీఎం గోడం ను తనిఖీ నిర్వహించిన

## జిల్లా కలెక్టర్ నిషాంతి. టి



**పాడేరు, పెన్ పవర్,మే 25:**నెలవరి తినిఖీ లో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాల రూమ్స్ లో భద్రపరిచి ఉన్న ఈవీఎం లను వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం వి ఎస్ లోకేశ్వరరావు,కలెక్టరేట్ ఎలక్షన్ సూపరిండెంటెంట్, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్, లతో కలిసి ఈవీఎం గోడం ను పరిశీలించిన జిల్లాకలెక్టర్నిషాంతి. టి

ఈవీఎం గోడం కు వేసిన సీలను పరిశీలించి, పరిసర ప్రాంతాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపిస్తూ భద్రపరిచి ఉన్న ఈవీఎంలకు సంబంధించి అధికారులకు, భద్రతా సిబ్బందికి సూచనలు చేస్తూ, కలెక్టర్ అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ తనిఖీ లో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు,బిజెపి ప్రతినిధి కె. ఆనంతయ్య , వైఎస్ఆర్ సిపి ప్రతినిధి కె సంతోష్ , టి డి పి ప్రతినిధి ఎస్ గంగాధర్ రావు,ఇతర ప్రజా ప్రతినిధి, పాడేరు మండల్ డిప్యూటీ తాసిల్దార్, ఎలక్షన్ తహసిల్దార్, ఇతర రెవెన్యూఅధికారులు, ఎలక్షన్ సూపరిండెండెంట్ లక్ష్మణరావు, ఎలక్షన్ సెల్ అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారున్నారు.

## దామనపల్లిలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కూటమి నాయకుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు రైతులకు విత్తనాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పెస కమిటీ సభ్యులు సాగిన రాధాకృష్ణ, పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు మాదల సతీష్, కూటమి నాయకులు పల్లం నాయుడు, బురిడీ నాగరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కోసూరు ఉషారాణి, సర్వేయర్ గబులంగి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు సిద్ధం కండి...!

- కొయ్యూరు టిడిపి మండల అధ్యక్షులు కాకురు చంద్రరావు పిలుపు



**కొయ్యూరు, పెన్ పవర్ మే 25:** మండల కేంద్రం వద్ద ఏర్పాటు చేయనున్న మహానాడుకు మండల టిడిపి నేతలు సిద్ధం కావాలని టిడిపి మండల అధ్యక్షులు కాకురు చందర్రావు పిలుపునిచ్చారు. ఈనెల 27,28 తేదీలలో జరిగే మహానాడుకు టిడిపి నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ నామినేటెడ్ పదవులు కలిగిన వారు, మహిళలు, సర్పంచులు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, మండల బాడీ, గ్రామ కమిటీలు భారీ ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.?

# ఉపాధి హామీ కూలీలకు ఫేషియల్ హాజరు రద్దు చేయాలి : సీఐటీయూ డిమాండ్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 25:** జీకే వీధి మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం గ్రామంలో శనివారం సీఐటీయూ మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, ఉపాధి కూలీలకు అమలు చేస్తున్న ఫేషియల్ హాజరు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫేషియల్ హాజరు కారణంగా సెల్ఫోన్ సిగ్నల్ ఉన్నప్పుడే హాజరు నమోదవుతోందని, సిగ్నల్ లేకపోతే పని చేసినా హాజరు పడక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ విధానాన్ని రద్దు చేయకపోతే కూలీలతో కలిసి పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడుతూరి పోతురాజు, బాబురావు, లవరాజు తదితరులు పాల్గొన్నారు.

# వీరవరం గ్రామ తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీడీఓకు వినతిపత్రం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 25:**జీకే వీధి మండలంలోని వంచుల గ్రామ పంచాయతీ పరిధిలోని వీరవరం గ్రామంలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కూటమి నాయకులు మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వీరవరం గ్రామ ప్రజలు గత కొంతకాలంగా తీవ్రమైన తాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో లేక మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, గ్రామంలో శాశ్వత పరిష్కారం కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి టీడీపీ మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు, టీడీపీ సీనియర్ నాయకులు ముక్కాలి మహేష్,జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు,బీజేపీ మండల అధ్యక్షులు కాకూరి శేఖర్, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు బత్తుల సిద్ధార్థ్ మార్క్, టీడీపీ నాయకులు పంద్ర నూకరాజు,జనసేన నాయకులు కొయ్యం సిద్దు, వనపల ఈశ్వర్తో పాటు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణ, క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సేవల వ్యవస్థను మరింత బలోపేతం చేయదానికి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి




- జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ

**పాడేరు, పెన్ పవర్,మే 25:**గ్రామీణ, క్షేత్ర స్థాయి ఆరోగ్య సేవల వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, హెల్త్, వెల్నెస్ సెంటర్లలో క్లినికల్ వర్క్ ఫ్లోస్ అమలును మెరుగుపరచడమే లక్ష్యంగా ఐసీఎమ్ఆర్, ఏయిమ్స్ ఢిల్లీకి చెందిన ప్రముఖ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ సూచించారు. తేది 25-05-2026 నుండి 29-05-2026 వరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్ వోఎస్ ), మెడికల్ ఆఫీసర్లు "క్లినికల్ వర్క్ ఫ్లోస్" పై సామర్థ్య వృద్ధిని పెంపొందించుకోవాలన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమం భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్ఆర్), ఎయిమ్స్ ఢిల్లీ సహకారంతో అమలు చేయబడుతోందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిహెచ్ వోలు, మెడికల్ ఆఫీసర్లలో ప్రమాణిత క్లినికల్ వర్క్ ఫ్లోస్, పేషెంట్ మేనేజ్మెంట్ సిస్టమ్స్, ఇంప్లిమెంటేషన్ రీసెర్చ్ విధానాలు, క్షేత్ర స్థాయిలో సమర్థవంతమైన ఆరోగ్య సేవల అమలుపై సామర్థ్యాలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

పాడేరు ఐటిడిఏ పివో ఆదిత్య వర్మ మాట్లాడుతూ సిహెచ్ వోఎస్, మెడికల్ ఆఫీసర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.

డాక్టర్ టి.ఎన్. ప్రతాప్ గ, అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (అడిషనల్ డిఎమ్ హెచ్ వో ), పాడేరు, అల్లూరి జిల్లా ఈ కార్యక్రమం అమలుకు బాధ్యత వహిస్తున్న జిల్లా నోడల్ అధికారి, డీపీఎంఓ, ఎన్హెచ్ఎమ్ డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొని శిక్షణా కార్యక్రమం యొక్క లక్ష్యాలు, అమలు విధానం ఆశించిన ఫలితాల గురించి, గిరిజన ప్రాంతాల్లో వ్యవస్థీకృత క్లినికల్ వర్క్ ఫ్లోస్, నాణ్యమైన ఆరోగ్య సేవల ప్రాధాన్యతను వివరించారు.

ఐసీఎమ్ ర్ కు చెందిన సైంటిస్ట్ జి ఱ హెడ్, సోషియో – బిహేవియరల్ , హెల్త్ సిస్టమ్స్, ఇంప్లీమెంటేషన్ రీసెర్చ్ డివిజన్, ఏక్విప్ హెచ్ డబ్ల్యు సి ప్రాజెక్ట్ జాతీయ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.వి. బాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు క్లినికల్ వర్క్ ఫ్లోస్, ప్రాథమిక ఆరోగ్య సేవల బలోపేతంలో ఇంప్లిమెంటేషన్ రీసెర్చ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిపుణుల బృందంలో డాక్టర్ వై.ఎస్. కుసుమ , ప్రొఫెసర్, ఏయిమ్స్ ఢిల్లీ, డాక్టర్ రూపా , సైంటిస్ట్ ఈ , ఐసీఎమ్ ర్, డాక్టర్ సౌరభ్ , సైంటిస్ట్ ఈ , ఐసీఎమ్ ర్, డాక్టర్ సిస్టర్ నిషా జోస్ , సైంటిస్ట్ ఈ , ఐసీఎమ్ ర్, డాక్టర్ పుల్కిత్ వర్మ , సైంటిస్ట్ డి , ఐసీఎమ్ ర్ , డాక్టర్ నేహా దహియా , సైంటిస్ట్ డి , ఐసీఎమ్ ర్ తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాలను అక్రమ తరలిస్తే ఉపేక్షించం..!

- హుకుంపేట సీఐ విజయ్ కుమార్



**హుకుంపేట పెన్ పవర్ మే25:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జంతు సంరక్షణ చట్టాలు అక్రమ పశువు రవాణా నియంత్రణ జంతువులపై క్రూరత్వం నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లుగా హుకుంపేట సీఐ విజయ్ కుమార్ తెలిపారు గౌరవ హైకోర్టు అలాగే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బక్రీద్ పండగ సందర్భంగా అక్రమ పశువుల రవాణా చట్ట విరుద్ధ కార్యకలాపాలపై కఠిన నిఘా ఏర్పాటు చేశామని ప్రధాన రహదారులు సరిహద్దుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు పశువుల అక్రమ రవాణా సమయంలో రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎవరైనా చట్ట విరుద్ధంగా పశువులను అక్రమ రవాణా చేస్తే తక్షణమే హుకుంపేట సీ.ఐ విజయ్ కుమార్ ఫోన్ నెంబర్ 9281442989 కు సమాచారం అందించాలన్నారు ప్రజలు శాంతి భద్రతాల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు

# చంపాపుట్టు రహదారిలో పొంచి ఉన్న ప్రమాదం



కల్వర్టు నిర్మించాలని జీఎస్యూ బాబుజీ డిమాండ్

**స్టాఫ్ రిపోర్టర్,పెదబయలు/ పాడేరు,పెన్ పవర్,మే 25:**అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బంగారుమెట్ట పంచాయతీ చంపాపుట్టు గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి పూర్తిగా కోతకు గురై అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజూ వందలాది ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలతో పాటు ఈ ప్రాంత ప్రజలకు ప్రధాన రవాణా ఆధారమైన ఆర్టీసీ బస్సు కూడా ఇదే మార్గంలో ప్రయాణిస్తోంది. రహదారి కుంగిపోయిన ప్రాంతంలో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మణుగూరు బాబుజీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ జిల్లా, మండల స్థాయి అధికారులు ఇదే రహదారిపై ప్రయాణిస్తున్నప్పటికీ సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. స్థానిక గిరిజనుల ప్రాణాల భద్రతపై అధికారులు కనీస శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు గురైన ఇరుకైన ప్రదేశంలో ఇరువైపుల నుంచి భారీ వాహనాలు ఒకేసారి వస్తే అరగంట నుంచి గంట వరకు ట్రాఫిక్ నిలిచిపోతుందని స్థానికులు చెబుతున్నారు. రహదారి దుస్థితి కారణంగా రేషన్ వాహనాలు, నిత్యావసర సరుకుల వాహనాలు, టిప్పర్లు లోపలి గ్రామాలకు చేరుకోలేక వెనుదిరుగుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ ప్రాంత గిరిజనులకు ఆర్టీసీ బస్సే ప్రధాన రవాణా సౌకర్యం. రహదారి ప్రమాదకరంగా మారడంతో ఒక్క పూట బస్సు రాకపోయినా మారుమూల గ్రామాల ప్రజలు, విద్యార్థులు కొండల మధ్య కాలినడకన ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడుతోందని బాబుజీ తెలిపారు. రానున్న వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమించి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏదైనా ప్రమాదం జరిగి అమాయక గిరిజనుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకముందే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని జీఎస్యూ డిమాండ్ చేసింది. యుద్ధప్రాతిపదికన నూతన కల్వర్టు నిర్మించి రహదారిని పునరుద్ధరించాలని, మారుమూల గిరిజన గ్రామాల రవాణా సౌకర్యాన్ని కాపాడాలని కోరారు.

## పాడైన రోడ్లు మరమ్మత్తులు చేపట్టండి...!

అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కోరుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి



**కొయ్యూరు, పెన్ పవర్ మే 25:** కొయ్యూరు మండలంలో బాలారం నుండి చింతలపూడి, కన్నంపేట నుండి పాడి, కొంగ సింగి నుండి కొమ్మిక, ఆడాకుల నుండి చమ్మ చింత వరకు పాడైన రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మల్లవరం జంక్షన్ లో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలతో భారీ నిరసన చేపట్టారు. ఈ రోడ్లు నిర్మాణం పూర్తయ్యేంతవరకు నిరసన చేయపడతామని అల్లూరి సీతారామరాజు జిల్లా సిపిఐ కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ధన్యము రాజు కనకరాజు, జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు వియుపు నానాజీ, మాజీ సర్పంచులు కుడుముల రాజు, గుమ్మ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# వచ్చేనెల 9 నుండి 11 వరకు వాలీబాల్ పోటీలు

ఆసక్తి గలవారు ఈ నెల 31 లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి




**కొయ్యూరు, పెన్ పవర్ మే 25:**శ్రీ శ్రీ శ్రీ బోడకొండమ్మ తల్లి పండగా సందర్భంగా వచ్చేనెల 9 నుండి 11 వరకు డౌనూరు నందు వాలిబాల్ పోటీలు జరుగును. ఆసక్తిగల వాళ్లు ఈ పంచాయతీ డౌనూరు, మూలపేట, గదబపాలెం, చిట్టంపాడు, ఆధార్ కార్డు తప్పని సరి గా ఉండాలి పోటీలో పాల్గొనే జట్లు ఈ నెల 31లోగా పేర్లు నమోదు చేసుకోవాలి అని ఉత్స కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు సంప్రదించ వలచిన వారి పేర్లు బోనంగి ప్రసాద్ మాస్టర్ 9491600772 గోమశీ ప్రసాద్ 70139 89516 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# ?ఘనంగా వంటాలమామిడిలో 'జన్ భాగీదారీ అభియాన్' ముగింపు వేడుకలు




**ఐటీడీఏ పీఓ ఆదిత్య వర్మ.**

**పాడేరు, పెన్ పవర్,మే 25:**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'జన్ భాగీదారీ అభియాన్' కార్యక్రమ ముగింపు వేడుకలలో సోమవారం మధ్యాహ్నం పాడేరు మండలం వంట్లమామిడి గ్రామ పంచాయతీ, వంట్లమామిడిలో ఘనంగా నిర్వహించారు.

సోమవారం మధ్యాహ్నం వంట్లమామిడిలో ఏర్పాటుచేసిన జాతీయ గరిమ ఉత్సవ్ 2026, జన్ భగీ దారీ అభియాన్, "సబ్సే దూర్- సబ్సే పెహలే " ఈనెల 18వ తారీకు నుండి 20వ తారీకు వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించడం జరిగిందని ఈరోజు ముగింపు కార్యక్రమాన్ని వంటలు మాములుగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముందుగా బిర్సముండా, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ.

? ఈ మెగా క్యాంప్లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ మాట్లాడుతూ ఈ పథకాల ద్వారా ప్రతి ఒక్క గిరిజన మహిళ ఆర్థికంగా నిలదుక్కోవడమే కాక ప్రతి ఒక్కరూ వ్యాపారవేత్తగా ఎదగాలని లక్ష్యంతో ఈ పథకాలు అమలు జరుగుతున్నాయని వీటిని ఏ విధంగా అందిపుచ్చుకోవాలో ఇలాంటి సదస్సుల ద్వారా అవగాహన తెచ్చుకుని గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయాన్ని పొంది ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రకృతి పరంగా ఎన్నో వనరులు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే చాలని తెలిపారు. గ్రామీణ మహిళలు వీడి వీకల ద్వారా తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులు ఎంతగానో బాగుందని, వాటిని మార్కెటింగ్ చేసే విధానం తెలుసుకుంటే మీరంతా వ్యాపారవేత్తలవడం తధ్యమని అన్నారు.

జిల్లాలో ఐటీడీఏ ద్వారా గ్రామీణ పేద మహిళలకు అన్ని రకాల శిక్షణలు ఇస్తూ వారు ఆర్థికంగా బలోపేతం చెందేందుకు సబ్సిడీల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు.

ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఏం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో భారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 777 గ్రామాలకు ఈ పథకం జాన్ భగీ దారీ అభియాన్ అమలు జరిగిందని, 260 గ్రామాలకు డిఏజుగా పథకం కింద లబ్ధి పొందుతున్నారన్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా ప్రజలకు క్యాంపు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై వివరించారు.

ఈ ముగింపు వేడుకల్లో భాగంగా ప్రజల సౌకర్యార్థం, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వారు ఏర్పాటుచేసిన మెడికల్ హెల్త్ క్యాంపు, ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్లో మిల్లెట్స్ తో తయారుచేసిన వివిధ రకాల వంట వంటకాలు, ప్రకృతి ఉత్పత్తులను పరిశీలించి మిల్లెట్స్ తో తయారు చేసిన వంటకాలను ఆయన రుచి చూశారు. జిల్లా ఘోరమైన అభివృద్ధి సంస్థ, ూాౖా, వెలుగు, ఏ ఎస్ఆర్ జిల్లా పాడేరు వందన వికాస్ కేంద్రం ద్వారా తయారు చేసిన వివిధ రకాల పచ్చళ్ళు తినబండారాలను పరిశీలించారు, ఈ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ సెంటర్ ను కూడా ఆయన పరిశీలించారు.

అధికారులచే గ్రామంలో పర్యటన (ట్రాన్సిట్ వాక్),
ఉచిత మెగా వైద్య శిబిరం (మెగా మెడికల్ క్యాంప్),
ఆధార్ నమోదు మరియు సవరణ స్టాల్,
విడివికె (ఎణఎఖ) స్టాల్,
ఐసీడీఎస్ (×జణూ) స్టాల్,
?గృహ నిర్మాణ లబ్ధిదారుల నమోదు (హౌసింగ్ స్టాల్),
?పీఎం ఉజ్వల (ూవీ ఖయియిఝశ్రీఖ) గ్యాస్ కనెక్షన్ల నమోదు స్టాల్లను
?కేంద్ర బృందం (వీశీూ ుఝఎ) వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ 'జన్ భాగీదారీ అభియాన్' క్షేత్రస్థాయి పరిశీలన మరియు డాక్యుమెంటేషన్ కొరకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (వీశీూ) ప్రతినిధులు శ్రీ చిరాగ్ ఖురానా (టీమ్ లీడర్), శ్రీ వరుణ్ జునేజా (కో-టీమ్ లీడర్) లతో కూడిన బృందం ఐ టి డి ఏ పీఓ కార్యక్రమంలో పాల్గొన్నారు.

?ఈ కార్యక్రమానికి పాడేరు ఎంపీడీఓ,నోడల్ అధికారిగా తేజ రతన్ , వంటాలమామిడి పంచాయతీ కార్యదర్శి గ్రామ స్థాయి అధికారిగా భారతి వ్యవహరిస్తూ, ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు.

ఈ సమావేశంలో ఎంపీటీసీ ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ పాంగిరాము, డి ఆర్ డి ఎ పి డి మురళి, ఐసిడిఎస్ పి డి ఝాన్సీరాంపడాల్, జిల్లా అదనపు మెడికల్ అధికారి డాక్టర్ ప్రతాప్, ఐటిడి పరిపాలన అధికారి హేమలత, ఈఈ పిఆర్ పడాల్, మైక్రో ఇరిగేషన్ అధికారి రహీం, ఇతర జిల్లా అధికారులు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఏకలవ్య పాఠశాలలో సందర్శించిన కలెక్టర్



**డుంబ్రిగూడ, పెన్ పవర్,మే,25:** డుంబ్రిగుడ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ నీశాంతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కృతిమ మేధస్సు (ఏఐ)పై అవగాహనతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ను పరిశీలించారు. క్యాంప్లో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, ప్రాజెక్టులు, సాంకేతిక అంశాలపై కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.. ఏఐ ద్వారా భవిష్యత్లో ఉన్న అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ త్రివేణి, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## గోపాలపట్నంలో శాశ్వత త్రాగునీటి సదుపాయం ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మే 25** : స్థానిక విశాఖ పశ్చిమ, గోపాలపట్నం రామాలయం వద్ద ప్రజల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన శాశ్వత త్రాగునీటి సదుపాయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఈరోజు ప్రారంభించారు. మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలకు చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా కూలర్తో కూడిన ఈ నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయడం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

ఈ శాశ్వత త్రాగునీటి కేంద్రాన్ని మళ్ళ గాంధీ మరియు వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందించి ఏర్పాటు చేయడం విశేషం. రామాలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్న మళ్ళ గాంధీ గారు మరియు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరో చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు ప్రాంతీయ ప్రజలు పాల్గొన్నారు. మానవత్వాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమానికి గోపాలపట్నం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఏపీఐఐసీ వారి ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ భూమిపూజ కార్యక్రమం






ముఖ్య అతిథులుగా హాజరైన అధికారులు,టీడీపీ నాయకులు

**సాలూరు , పెన్ పవర్ మే 25:**రాష్ట్ర ప్రభుత్వం చిన్న ఇంకా మధ్య తరహా సంస్థలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది.అదులో భాగంగా రాష్ట్రంలో 175 ఎంఎస్ఎంఈ పార్క్ లు సీఎం చంద్రబాబు వర్చువల్ గా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాలూరు నియోజకవర్గం దుగ్ధసాగరం వెళ్లే దారి క్వారీ దగ్గరలో ఏపీఐఐసీ వారు ఎంఎస్ఎంఈ పార్క్ కోసం భూమిపూజ నిర్వహించగా తాహిసిల్దార్ ఎం.సురేష్ పాల్గొన్నారు.ఈ మేరకు టిడిపి టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది చిట్టి చేతుల మీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.అనంతరం చిట్టి మాట్లాడుతు ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కు రాడానికి మంత్రి సంధ్యారాణి ఎంతో కృషి చేశారన్నారు.అలాగే ఇంజనీరింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ రీసైక్లింగ్,ఫుడ్ ప్రాసెసింగ్ అలాగే ప్లాస్టిక్, పేపర్ ప్యాకింగ్ వంటి వివిధ పరిశ్రమలు వస్తాయన్నారు.ఎమ్మార్వో మాట్లాడుతు ప్రాంతీయ అభివృద్దే కాకుండా యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. కమీషనర్ టిటి రత్న కుమార్,టౌన్ సీఐ అప్పలనాయుడు,ఎంపీడీవో పార్వతి, ముఖి. సూర్యనారాయణ,ఆముదాల.పరమేష్,ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజేష్ కుమార్, టీడీపీ నాయకులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గోపాలపట్నం బెహరా ఆసుపత్రిలో అరుదైన లాప్రోస్కోపీ శస్త్రచికిత్స

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మే 25 :** స్థానిక గోపాలపట్నం బెహరా ఆసుపత్రిలో అరుదైన లాప్రోస్కోపీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అధిక రక్తస్రావంతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రిని ఆశ్రయించిన 45 ఏళ్ల మహిళకు వైద్య బృందం సమర్థవంతమైన చికిత్స అందించి, కడుపులో ఉన్న పది ఫైబ్రాయిడ్ కాయలను తొలగించినట్లు వెల్లడించారు.

గైనకాలజిస్టు డాక్టర్ ప్రవీణ్య వివరాల ప్రకారం, నగరానికి చెందిన మహిళ కొంతకాలంగా పీరియడ్స్ సమయంలో తీవ్రమైన రక్తస్రావంతో పాటు కడుపు నొప్పితో ఇబ్బందులు పడుతూ ఆసుపత్రికి వచ్చారు. అవసరమైన వైద్య పరీక్షలు, స్కానింగ్ నిర్వహించగా ఆమె గర్భాశయంలో "మల్టిపుల్ ఫైబ్రాయిడ్ యుట్రస్" సమస్య ఉన్నట్లు గుర్తించారు. గర్భాశయంలో సుమారు పది ఫైబ్రాయిడ్ కాయలు ఉండటంతో పరిస్థితి క్లిష్టంగా మారిందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో డాక్టర్ సృజన్తో కలిసి ప్రత్యేక వైద్య బృందం లాప్రోస్కోపీ పద్ధతిలో శస్త్రచికిత్స నిర్వహించింది. కేవలం చిన్న రంధ్రాల ద్వారా చేసే ఈ ఆధునిక శస్త్రచికిత్సలో పది కాయలను విజయవంతంగా తొలగించినట్లు వైద్యులు వెల్లడించారు. సాధారణ శస్త్రచికిత్సతో పోలిస్తే లాప్రోస్కోపీ ద్వారా రక్తస్రావం తక్కువగా ఉండటం, త్వరగా కోలుకునే అవకాశం ఉండటం ముఖ్యమైన ప్రయోజనాలని చెప్పారు.

శస్త్రచికిత్స అనంతరం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతం కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. తాను తిరిగి ఆరోగ్యంగా మారేందుకు సహకరించిన వైద్య బృందానికి బాధిత మహిళ కృతజ్ఞతలు తెలియజేశారు.




ఆధునిక వైద్య సదుపాయాలతో మహిళలకు నాణ్యమైన చికిత్స అందిస్తున్నామని, ఫైబ్రాయిడ్ సమస్యలను ప్రారంభ దశలో గుర్తిస్తే శస్త్రచికిత్సలు మరింత సులభంగా చేయవచ్చని వైద్యులు సూచించారు.

## తాగునీటి కుళాయిలు మరమ్మతు చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి



కుళాయిలు ధ్వంసం కావడంతో వృథాగా పోతున్న నీరు

**జి.మాడుగుల. పెన్ పవర్.జూలై (25)** మండలంలోని పెదలోచలి పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామం మెట్టపాడులో తాగునీటి కుళాయిలు ధ్వంసం కావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన కుళాయిలు నిర్మించిన కొద్ది రోజులకే విరిగిపోవడంతో తాగునీరు సేకరించుకోవడం కష్టంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిలు దెబ్బతినడంతో నీరు నిరంతరం వృథాగా పారిపోతోందని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. మహిళలు, వృద్ధులు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ధ్వంసమైన కుళాయిలను మరమ్మతు చేసి గ్రామానికి సరైన తాగునీటి సౌకర్యం కల్పించాలని మెట్టపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

## శ్రీ శ్రీ మా భైరవ క్రికెట్ టోర్నమెంట్ విజేత కుంబిరిపడ

- విజేతగా నిలిచి సీల్డ్ తో పాటు 11500రూ ప్రైజ్ మనీ సొంతం చేసుకున్న కుంభీరిపడ జట్టు.
- విజేతగా నిలిచిన కుంబిరిపడ జట్టును అభినందించిన టిడిపి నాయకుడు చెండా బాబుజీ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 25.**ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన సుర్మి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ మా భైరవ ఉత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో ముంచంగిపుట్టు మండలం, మాకవరం పంచాయతీ, కుంభీరిపడ గ్రామ క్రికెట్ జట్టు విజేతగా నిలిచి క్రికెట్ కప్ ను సొంతం చేసుకుందనీ టిడిపి నాయకుడు చెండా బాబుజీ తెలిపారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఒడిస్సా రాష్ట్రంలోనీ నందపూర్ బ్లాక్, బిల్లపుట్టు పంచాయతీ సుర్మిలో శ్రీ శ్రీ మా భైరవ ఉత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ లో ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయని, ఇందులో టోర్నమెంట్ విజేతగా కుంబిరిపడ జట్టు నిలవగా, రన్నరప్ గా ఒతుండా జట్టు నిలిచాయన్నారు. టోర్నమెంట్ విజేత కుంబిరిపడ జట్టుకు వార్డ్ మెంబర్ నిర్కి కాశీనాథ్ చేతుల మీదుగా సీల్డ్ తో పాటు 11500 ప్రైజ్ మనీ అందించారన్నారు. ఒడిస్సా ప్రాంతంలో వెళ్ళి క్రికెట్ టోర్నమెంట్ లో విజేతగా నిలవడం ఆనందంగా ఉందని, క్రికెట్ టోర్నమెంట్ మ్యాన్ ఆఫ్ ద సిరీస్ వంతాల వికాస్ కు, విజేతగా నిలిచిన కుంబిరిపడ జట్టుకు ఆయన అభినందించారు. ముఖ్యంగా యువత క్రీడలో రాణించాలని బాబుజీ సూచించారు.

## బాధ్యతాయుత జీవన విధానాన్ని ప్రజలు అలవర్చుకోవాలి



**టెక్కలి, పెన్ పవర్ మే 25 :** భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఏ.ఓ కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. దేశంలో మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావాలు, ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న ఇంధన ధరలు, నీరు--విద్యుత్ వనరులపై అధిక ఒత్తిడి నేపథ్యంలో ప్రజలు బాధ్యతాయుత జీవన విధానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన "పొదుపు జాగ్రత్తలు -- బాధ్యతాయుత జీవనం" పిలుపును ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పేందుకు జిల్లావ్యాప్తంగా సమగ్ర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వినతి పత్రంలో కోరారు.

అదే విధంగా ప్రతి గ్రామంలో గ్రామసభల ద్వారా "పొదుపు -- భవిష్యత్ భద్రత" అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గృహ విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణ, కుటుంబ ఆర్థిక నిర్వహణపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో టెక్కలి మండలం అధ్యక్షులు జర్జాన రాంజీ, ఉపాధ్యక్షులు వడిసి బాబురావు, లావణ్ తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ 92వ వార్డులో మెరిట్ విద్యార్థులకు ఘన సత్కారం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బెహరా భాస్కరరావు




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మే 25 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జై శ్రీరామ కాపు యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘన అభినందన సభ నిర్వహించారు. కాలనీలోని ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు, పెందుర్తి ఏఎస్ఐ కాళీ ప్రసాదరావు హాజరై విద్యార్థులను అభినందించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులైన కృతిక (593), సాయి సాత్విక్ (574), లోహిత్ కుమార్ (570), యశ్వంత్ కరక దిలీప్ కుమార్ (569), శ్రీహర్షిని (561), రోహన్ (560), పవిత్ర (560), దివ్య (529), చాందిని (515), హేమంత్ కుమారి (503) తదితర 11 మంది విద్యార్థులను సాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో విద్యకు ప్రాధాన్యత పెంచేందుకు ఇలాంటి సన్మాన సభలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి తల్లిదండ్రులకు, కాలనీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థుల కష్టానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకం కూడా ముఖ్య కారణమని అన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించేలా కాలనీ స్థాయిలో విద్యాపరమైన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కె వి వి సత్యనారాయణ, పెందుర్తి సీఐ సతీష్ కుమార్, కాపు నాయకులు పెదబాబు, డేటాప్రో అధినేత రాజశేఖర్, బీసీ కాలనీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డివివి రమణి, గేదెల మురళీకృష్ణ, గొడ్డు నాగరాజు, కంపర సత్తిబాబు, జై శ్రీరామ కాపు యువజన సేవా సంఘం అధ్యక్షులు కంచిపాటి జగదీష్ కుమార్, సూరిబాబు, సెక్రటరీ శంకర్, షేక్ వల్లి, సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూసార పరీక్షలు తోనే ఎరువుల యాజమాన్య పద్ధతులు



**టెక్కలి, పెన్ పవర్ మే 25 :** భూసార ఆధార పరీక్షలు ఆధారంగా భూమిలో గల పోషకాల వివరాలను తెలుసుకుని తగు మోతాదులో ఎరువులు వేసుకోవడం ద్వారా ఎరువుల ఖర్చును తగ్గించి అదిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు అన్నారు. కోటబొమ్మాలి మండలం పెద్దబమ్మిడి గ్రామంలో మట్టినమూనాలను సేకరించే విదానం పై రైతులకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. 25 ఎకరాలకు నమూన చొప్పున్న గ్రామ వ్యవసాయ సహాయకులు సహకారంతో మట్టినమునా సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. మండలంలో 218 నమూనాలు మే నెలలో సేకరణ లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు, వీఏఏ డి. ఝాన్సీ రైతులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజలకు తాగు నీరు..

**సాగునీరు ఇబ్బందులు రాకూడదు...**

**అధికారులకు సూచించిన ఎమ్మెల్యే కళా వెంకటరావు....**




**చీపురుపల్లి పెన్ పవర్ మే 25 :** ప్రజలకు అవసరమైన త్రాగునీరు రైతులకు అవసరమైన సాగునీటి ఇబ్బందుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదంటూ చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అధికారులకు హెచ్చరించారు. సోమవారం నాడు స్థానిక పార్టీ కార్యాలయంలో సాగునీరు త్రాగునీరు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వేసవి దృశ్య గ్రామాల్లో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పంటలు ఎండిపోకుండా రైతులను ఆదుకోవాలి అని సూచించారు. ఈ రెండు విషయాలలో అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు అని హెచ్చరించారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించాలి అని వివరించారు. లీకేజీలు, మోటార్ల మరమ్మతులకు నిమిషాల వ్యవధిలోనే పునరుద్ధరణ జరగాలి అన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తక్షణ నీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగా విత్తనాలు, ఎరువుల లభ్యత ఉండేలా చూడాలి అని సూచించారు . ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా, రైతాంగం నష్టపోకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాథమిక అవసరాల్లో తాగునీరు అత్యంత ముఖ్యమైనది. వేసవి కాలంలో ఎక్కడా నీటి కొరత అనే మాటే వినిపించకూడదు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఒక ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి అన్నారు. ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఉన్నా, మోటార్లు పాడైనా కాలయాపన చేయకుండా నిమిషాల వ్యవధిలోనే పునరుద్ధరించాలి. భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి, ఆయా సమస్యాత్మక గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా అయినా సరే నీటిని సరఫరా చేసేందుకు తక్షణ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి అని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి అని కోరారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి అన్నారు.. అలాగే ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చీపురుపల్లి పరిసర ప్రాంతాల్లో సాగవుతున్న కూరగాయలు, పండ్ల తోటలను కాపాడుకోవడం మన బాధ్యత అని, బిందు సేద్యం (డ్రిప్), స్ప్రింక్లర్ల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులకు అవసరమైన సబ్సిడీ పరికరాలను త్వరితగతిన అందించాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. ఎండ దెబ్బ నుంచి తోటలను రక్షించుకునేందుకు అధికారులు ప్రతి గ్రామానికి వెళ్లి రైతులకు శాస్త్రీయ సలహాలు, సూచనలు అందించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రైతు కామ నాయుడు, గవిడి నాగరాజు, దన్నాన రామచంద్రుడు, గరివిడి నాయకులు సురేష్, పైల బలరాం, గరివిడి మేరకు ముడుదాం గుర్ల మండలాల నాయకులు,

ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీలత, ప్రాజెక్టు డీఈ గోవిందరావు, నియోజకవర్గ వ్యవసాయ, ఉద్యానవన అధికారులు మరియు నాలుగు మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు...

# జిల్లాలో ఎం.ఎస్.ఎమ్.ఈ పార్కుల అభివృద్ధికి కృషి



**వచ్చిన పెట్టుబడుల్లో 60 శాతం విశాఖ రీజియన్‌కే**

**కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 25 :** జిల్లాలో ఎం.ఎస్.ఎమ్.ఈ పార్కులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషో ర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబా బు నాయుడు విజయవాడ నుంచి 38 ఇండ స్ట్రియల్ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా, విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో ని కంచరపాలెంలో రూ.14.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఫ్లోటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజుతో కలిసి సోమవారం శిలాఫలకాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభి వృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంద న్నారు. "వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్" నినాదంతో యువతను పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో 138 ఎం.ఎస్.ఎమ్.ఈ పార్కులను ఏర్పాటు చేసిం దని చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఏడు ఎం.ఎస్.ఎమ్.ఈ పార్కుల్లో ఇప్పటికే ఆరు పార్కులకు శంకుస్థాపన జరిగిందని, పెదగంట్యా డ పార్క్ ఇప్పటికే ప్రారంభమైందని వెల్లడించా రు. మిగిలినవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నా యని తెలిపారు. విశాఖ సౌత్ నియోజకవర్గం లో కూడా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, పోర్టు ప్రాంతం కావడంతో విశాఖపట్నం పోర్టు అధికారులతో చర్చించి లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ప్రయత్నా లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎం.ఎస్.ఎమ్.ఈ పాలసీ ప్రకారం రూ.10 కోట్ల పెట్టుబ డితో పరిశ్రమ స్థాపిస్తే 75 శాతం వరకు ఇన్సెం టివ్‌లు, రాయితీలు పొందే అవకాశం ఉందన్నా రు. ఐటీఐ చదువుతున్న విద్యార్థుల్లో పారిశ్రా మిక అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువ పారిశ్రామికవేత్తలకు సహకా రం అందించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 28 పారిశ్రామిక విధానాలు తీసుకువచ్చిందని, దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో తొలి ఏడాది 16 శాతం, రెండో ఏడాది 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయని వెల్లడించారు. రాష్ట్రానికి వచ్చిన రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో 60 శాతం పైగా విశాఖ ఎకనా మిక్ రీజియన్‌కు రావడం ప్రాంతానికి సువర్ణా వకాశమని పేర్కొన్నారు. యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజుఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ నార్త్ నియోజకవర్గ పరిధిలో 83 సెంట్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఫ్లోటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో 36 మంది కొత్త పారిశ్రామికవేత్తలకు 725 చదరపు అడుగుల స్థలాలు, భవనాలు కేటాయిస్తామని తెలిపారు. పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి విశాఖలో మైక్రో స్మాల్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పా రు. చిన్న పరిశ్రమల వివాదాల వేగవంత పరి ష్కారం కోసం డిస్ప్యూట్ రిజల్యూషన్ పోర్టల్ ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎం.ఎస్.ఎమ్.ఈ చట్టం ప్రకారం సరుకు సరఫ రా చేసిన 45 రోజుల్లో చెల్లింపులు జరగాల్సి ఉంటుందని, ఆలస్యమైతే వడ్డీతో చెల్లింపులు జరిగేలా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రత్యేక నైపు ణ్య శిక్షణ అందించి యువతను పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. కొత్త పరిశ్రమలు స్థాపించే వారికి రాయి తీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలి పారు. పారిశ్రామిక ప్రాంతాల్లో తక్కువ ధరలకు స్థలాలు పొంది వాటిని ఇతరులకు అద్దెకు ఇచ్చే విధానాన్ని అరికట్టాలని, ఉత్పత్తి ప్రారంభించని యూనిట్ల స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుని కొత్త పారిశ్రామికవేత్తలకు కేటాయించేలా చర్య లు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఐలా చైర్మన్ జగపతి రాజు, ఏపీఐఐసీ అధికారులు, జోనల్ మేనేజర్ సింహా చలం, జీఎం ఇండస్ట్రీస్ వి. ఆదిశేషు, పారిశ్రామి కవేత్తలు, స్థానిక నాయకులు లొడగల కృష్ణ, ఉషా, కిరణ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీహెచ్‌లో వైద్య సేవలపై లోక్‌సత్తా ఆందోళన

**అత్యవసర విభాగాల్లో నిర్లక్ష్యం తగ్గించాలి భీశెట్టి బాబ్జి**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 25 :** ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న కేజీహెచ్‌లో అత్యున్నత వైద్య సేవలు ప్రతి రోగికి సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు కోరారు. సోమ వారం లోక్‌సత్తా నాయకులతో కలిసి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వ తీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు కేజీహెచ్‌పై నమ్మకంతో వైద్యం కోసం వస్తున్నారని తెలిపారు. అయితే కొంత మంది డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణి కారణం గా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని ఆరోపించారు. రాష్ట్రంలో అనుభవజ్ఞులైన వైద్యులు కేజీహెచ్‌లో ఉన్నప్పటికీ అత్యవసర వైద్య సేవల్లో సరైన సమన్వయం లేకపోవడం బాధాకరమన్నారు. గిరిజనులు, గ్రామీణ ప్రాం తాల నుంచి వచ్చే అమాయక ప్రజలకు వార్డులు ఎక్కడున్నాయి, సంబంధిత డాక్టర్లు ఎవరు అనే కనీస సమాచారం కూడా అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పృహలో లేని లేదా నడవలేని రోగులను తరలించేందుకు అవసర మైన స్ట్రెచర్లు, వీల్‌చైర్లు సరిపడా అందుబాటు లో లేవని రోగులు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. కేజీహెచ్‌లో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల పై త్వరలో లోక్‌సత్తా బృందం అన్ని వార్డులను సందర్శించి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తుందని చెప్పారు. ఆ నివేదికను ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి తో పాటు జిల్లా ప్రజాప్రతినిధు లకు అందజేస్తామని భీశెట్టి బాబ్జి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నగర నాయకులు గొట్టాపు సుదీర్, పక్కి శంకర్, జలంత్రి రామచం ద్రరాజు, ఇప్పలవలస గోపి, సిరిపురపు శ్రీనివా స్, బోర రమేష్, వేగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు....

**ఎస్సై.వై.తారకేశ్వరరావు....**



**నాతవరం,పెన్ పవర్ (మే25):** ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం మండలంలో గల ఏపి.పురం పంచాయతీ నాయుడుపాలెం వద్ద ఏలేరు కాలువపై ఉన్న వంతెనకు సమీపంలో రహదారి ఇరువైపుల దెబ్బ తినడంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా స్థానిక ఎస్సై,పోలీస్ మైత్రి యువకుల సహకారంతో ఇసుక,గ్రావిల్ మిశ్రమంతో తాత్కాలి లెవెలింగ్ పనులు చేపట్టడం జరిగింది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై వై తారకేశ్వరరావు సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని,వారికి మర్యాదపూర్వకంగా లెటర్ పంపి త్వరలోనే పూర్తిస్థాయిలో రహదారి మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి

- పెండింగ్ వినతులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- జేసీ గొబ్బిళ్ల విద్యాధరి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 25 :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రా ధాన్యంతో పరిగణించి సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆమె సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లా డుతూ ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో తమ సమస్యలను తీసుకువస్తారని, వారి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకో కూడదన్నారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలిం చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధి కారులను ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రీ-సర్వే విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న వినతుల సంఖ్య అధికంగా ఉందని పేర్కొంటూ, వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొన్ని శాఖల అధికారులు ఫిర్యాదులపై వెంటనే స్పందించడం లేదని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరు గుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్య త్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. పీజీఆర్ఎస్‌లో 301 వినతులు స్వీకరణ

సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి మొత్తం 301 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 36, జీవీఎం సీకి చెందినవి 100, పోలీసు శాఖకు సంబంధి చినవి 24 కాగా, ఇతర శాఖలకు చెందినవి 141 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు, అదనపు కమిషనర్ సత్యవేణి, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి గోవిందు తదితరు లు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించా రు. వీసీ హాల్‌లో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ లో ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, తహాశీల్దార్లు ప్రజల ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి వీఎంఆర్డీఏ ప్రత్యేక చొరవ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 25:**వీఎంఆర్డీఏ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమి షనర్ఎన్ తేజ్ భర్త్ పాల్గొని, బాధితులతో మా ట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదే శించారు. సమస్యల పరిష్కారంపై గడువులోగా బాధితులకు సరైన సమాచారం అందించాలని సూచించారు. బాధితులు కార్యాలయాల చు ట్టూ పలుమార్లు తిరగాల్సిన అవసరం లేకుం డా, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి తగి న న్యాయం చేయాలని అధికారులకు సూచిం చారు.సోమవారం నిర్వహించిన ప్రజా దర్బా ర్‌కు మొత్తం 6 వినతులు అందగా, వాటిలో ప్లానింగ్‌కు సంబంధించినవి 2, ఇంజనీరింగ్‌కు సంబంధించినది 1, ఎస్టేట్‌కు సంబంధించినవి 2, ఇతర సేవలకు సంబంధించినది 1 ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, డీఏ ఫ్‌వో శిరీష, ముఖ్య ప్లానింగ్ అధికారి దివ్యలత, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వండ్లంపుట్టులో నీటి సమస్య పరిష్కారం

- నూతన మోటార్ ఏర్పాటు చేసిన ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది.
- వైసీపీ నాయకుడు ఎన్ సురేష్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 25.**మండలంలో గల జర్రేల పంచాయితీ, వండ్లంపుట్టు గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించినట్లు వైసీపీ నాయకులు ఎన్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. వండ్లంపుట్టులో నీటిని సరఫరా చేసే మోటర్ కాలిపోయి గ్రామంలో నీటి సరఫరా ఆగిపోయిందని, దీంతో గ్రామస్తులు నీటి సమస్య పరిష్కారానికి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ నేపథ్యంలో మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం అందించి గ్రామంలో అధికారులను తీసుకురావడం జరిగిందన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నీటి సరఫరాకు కలిగిన అంతరాయాన్ని గుర్తించిన అధికారులు కాలి పోయిన మోటార్ ను తొలగించి, వాటి స్థానంలో నూతన మోటార్ ఏర్పాటు చేశారన్నారు. ఇవే కాకుండా నూతనంగా ప్యానల్ బోర్డు, టేపులు ఏర్పాటు జరిగిందన్నారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించిన వైసీపీ నాయకులు సురేశ్ కు, సంబంధిత అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అయితే నీటి సమస్య పరిష్కారానికి వివిధ వార్త పత్రికలో వచ్చిన కథనాని అధికారులు స్పందించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి బాలకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ వర్క్ ఇన్స్పెక్టర్ గణపతి, గ్రామస్తులు కామేష్, సీతారామ్, ఆనంద్ రావు, భాస్కర్, సీతారామ్ బాలకృష్ణ, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కరాటేలో శిక్షణ



**గాజువాక:పెన్ పవర్,మే25:**జీవీఎంసీ స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ లో భాగంగా శ్రీ తిరుమల నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

వాకర్స్ పార్కులో కరాటే మాస్టర్ కిషోర్ సారథ్యంలో సుమారు 40 మంది బాలబలికులకు కరాటే కోచింగ్ 87 వార్డు మాజీ కార్పొరేటర్ బొండా జగన్నాథం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ తిరుమల సంక్షేమ సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు ,పరమానందం, సన్యాసిరావు, వెంకట్రావు కామరాజు, రాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, సెక్రటరీలో వరలక్ష్మి, జానకి బాల బాలికలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముఖ్యఅతిథి మాట్లాడుతూ నేటి సమాజంలో ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ శారీరక దృఢత్వానికి ఈ కరాటే చాలా ఉపయోగం రాష్ట్ర ప్రభుత్వం జీవీఎంసీ వారు ఏర్పాటు చేసిన ఇలాంటి సమ్మర్ క్యాంపులు మరింత మంది వినియోగించుకొని ఆరోగ్యం పెంపొందించుకొని హాయిగా జీవించాలని కోరారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు --

# అధికారులతో ఎమ్మెల్యే బండారు సమీక్ష



**రావులపాలెం పెన్ పవర్ మే 25:**వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతో సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశంలో కొత్తపేట డీఈఈ డి. చిట్టిరాజు, మండపేట డీఈఈ సి.హెచ్. శ్రీధర్, రావులపాలెం ఏఈ పి. నరేష్, ఆలమూరు ఏఈ డి.ఎం.కె. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో కొత్తగా 69 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయిన వెంటనే మార్పిడి చేసేందుకు అదనంగా 50 ట్రాన్స్ఫార్మర్లు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణమే కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే ఏసీలు ఆఫ్ చేసి, తిరిగి సరఫరా ప్రారంభమైన అరగంట తర్వాత మాత్రమే ఆన్ చేయాలని వినియోగదారులకు సూచించారు. ఇలా చేయడం వల్ల లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ పరికరాల నష్టం తగ్గుతాయని తెలిపారు.

బుధవారానికల్లా ఏనుగుల మహల్ సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందని, 33/11 నర్సిపూడి సబ్ స్టేషన్ మంజూరైందని ఎమ్మెల్యే వెల్లడించారు. భవిష్యత్తులో లో వోల్టేజ్, విద్యుత్ అంతరాయ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లు మార్చాలని.

-విద్యుత్ శాఖ అధికారులకు పీసీసీ సభ్యులు ధరణాలకోట శ్రీను వినతి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మే 25:** మండల కేంద్రమైన ప్రత్తిపాడు శివాలయం వీధిలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను తక్షణమే మార్చాలని ప్రత్తిపాడు సబ్ స్టేషన్ విద్యుత్ అధికారులకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు ధరణాలకోట శ్రీను సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ శివాలయం వీధిలో ఉన్న వైర్లు ప్రమాద భరితంగా మారడంతో ఆదివారం మధ్యాహ్నం ఒక వైరు తెగిపడిందన్నారు. తక్షణమే పంచాయతీ సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బంది వచ్చి బాగు చేయడం జరిగిందన్నారు. వైరు తెగిపడిన సమయంలో అదృష్టవశాత్తు జనసంచారం లేకపోవడంతో ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. వైర్లు బాగా పాతబడిన కారణంగా ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైర్లు మార్చాలని కోరారు. ఈ సందర్భంగా రూరల్ విద్యుత్ సిబ్బంది వెంకటరమణ కు వినతిపత్రం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్తిబాబు,ఏనుగుపల్లి రాంబాబు, ఎస్ కోటేశ్వరరావు ఇరుకుల చక్రం తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యుడు డాక్టర్ నిరంజన్ కన్నుమూత.



**టెక్కలి, పెన్ పవర్ మే 25 :** ప్రజల ఆరోగ్యానికి అండగా నిలిచిన సీనియర్ వైద్యులు డాక్టర్ సదాశివుని నిరంజన్ రావు ఇకలేరు. హైదరాబాదులో తన కుమారుడు ప్రవీణ్ నివాసంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసిన వెంటనే కోటబొమ్మాళి మండల పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గత 15 సంవత్సరాలుగా కోటబొమ్మాళి ప్రాంత ప్రజలకు ఆయన అందించిన వైద్య సేవలు మరువలేనివిగా నిలిచాయి. అర్ధరాత్రి వేళల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇండ్లకు కాంపౌండర్ లేకుండా తన స్కూటీ పైన మందుల సంచితో స్వయంగా వెళ్లి చికిత్స అందించిన అరుదైన వైద్యు నిగా డాక్టర్ నిరంజన్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారు. పేద, ధనిక అనే తేడా లేకుండా 24 గంటలు అందుబాటులో ఉండి ఎన్నో కుటుంబాలకు భరోసాగా నిలిచారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల తన కుమారుడు ప్రవీణ్ ఇంటివద్దకు హైదరాబాదుకు వెళ్లారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి కన్ను మూశారు. వైద్య వృత్తితో పాటు రాజకీయ రంగంలో కూడా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మాజీ కేంద్రమంత్రి దివంగత నేత కింజరాపుఎర్రన్నాయుడు ఎమ్మెల్యేగా ఉన్న కాలం నుండి నేటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వరకు తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పని చేసిన ముఖ్య కార్యకర్తగా డాక్టర్ నిరంజన్ రావు ప్రశంసలు పొందారు. పైసలతో సంబంధం లేకుండా వైద్యం అందిస్తూ మండల ప్రజలకు సుపరిచితులు. పేదల పాలిట సంజీవిని ఇక లేరు అంటూ గ్రామస్తులు, పార్టీ నాయకులు, ఆయన సేవలు పొందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ మృతి పట్ల రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ గోవిందరాజులు, దేశం మండల పార్టీ అధ్యక్షులు బోయిన సత్య శ్రీనివాస్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బోయిన రమేష్ గ్రామానికి చెందిన పలువురు నేతలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## సింహాచలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం డిజిటల్ సేవలను

కార్యనిర్వాహణాధికారి జల్లేపల్లి వెంకటరావు వెల్లడి



**సింహాచలం, పెన్ పవర్, మే 25 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం డిజిటల్ సేవలను మరింత విస్తృతంగా అమలు చేస్తూ, పూర్తిస్థాయి 'నగదు రహిత దేవస్థానం'గా తీర్చిదిద్దే దిశగా కీలక చర్యలు చేపట్టినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జల్లేపల్లి వెంకటరావు తెలిపారు. మే 25న విడుదల చేసిన ప్రకటనలో భక్తులు దర్శనం, ప్రసాదాలు, ఆర్జిత సేవల టికెట్లను సులభంగా, వేగవంతంగా పొందేందుకు పలు డిజిటల్ విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. దేవస్థానంలో ఏర్పాటు చేసిన మొబైల్ డిపాజిట్ కౌంటర్ వద్ద భక్తులకు అవసరమైన అన్ని సేవలు ఒకే చోట లభించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు ముందుగా అవసరమైన అన్ని సేవా టికెట్లను పూర్తిగా పొందిన అనంతరం మాత్రమే తమ మొబైల్ ఫోన్లను డిపాజిట్ కౌంటర్‌లో అప్పగించాలని సూచించారు. దీనివల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని తెలిపారు.

ఇకపై భక్తులు పొడవైన క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా పలు డిజిటల్ మార్గాల ద్వారా సేవలను పొందవచ్చని అధికారులు తెలిపారు. దేవస్థానం అధికారిక వెబ్‌సైట్, 'మనమిత్ర' యాప్ సేవలు, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్లు, అలాగే ప్రత్యేక క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాల ద్వారా దర్శనం, ప్రసాదాలు, ఆర్జిత సేవా టికెట్లు సులభంగా పొందవచ్చని వెల్లడించారు. అలాగే, దేవస్థానానికి ప్రత్యేకంగా కేటాయించిన అధికారిక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆలయంలోని ప్రతి సేవను డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో సింహాచలం దేవస్థానాన్ని పూర్తిస్థాయి క్యాష్‌లెస్ క్షేత్రంగా మార్చే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ఈఓ జల్లేపల్లి వెంకటరావు స్పష్టం చేశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భక్తులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే దేవస్థానం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ డిజిటల్ మార్పులకు సహకరించి, నగదు రహిత సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పెట్రోల్-డీజిల్ ధరలు నిర్మూలించడంలో

# కేంద్ర ప్రభుత్వం విఫలం




**జగ్గంపేట, పెన్ పవర్, మే 25:** పెంచిన పెట్రోల్-డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లి నగర్ లో రైతు కూలీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ వారం రోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగాయని ఈ ధరలను నిర్మూలించడంలో నరేంద్ర మోడీ విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఈ పెట్రోల్ డీజిల్ ధరలు పెరుగుదలతో నిత్యవసర వస్తువులు పెరిగిపోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. రైతులు సకాలంలో పండించిన ధరలకు గిట్టుబాటు ధర ఉండడం లేదు కానీ పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో అటు రైతులు ఇటు సామాన్య ప్రజలు, చిన్న చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. తక్షణమే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని లేని యెడల ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగవల్లి నగర్ నాయకులు డాన్ శ్రీను, మంగయమ్మ, లక్ష్మణరావు, సూరిబాబు,శ్రీను, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ విద్యా బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యం.

✸ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, వి జగన్మోహన్.




**కిర్లంపూడి, పెన్ పవర్, మే 25**: అత్యుత్తమ విద్యా బోధన ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి, వి జగన్మోహన్ అన్నారు.కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో ఎంఈఓ లు, టి జోసెఫ్, మక్కా చిన్నారావు ల ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఏ ఎం ఓ,వి జగన్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ డ్రైవ్ లో ఆయన సమక్షంలో ఆరు మంది విద్యార్థులను వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా ఏఎమ్ఓ మాట్లాడుతూ అర్హత గల పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు.ప్రభుత్వం అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకము, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లతోపాటు, ప్రతిభగల ఉపాధ్యాయులు అందించే అత్యుత్తమ విద్యా బోధనతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు టి.జోసెఫ్,మక్కా చిన్నారావు, వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# కొత్తపేట నుంచి హైదరాబాద్‌కు ఎన్టీఆర్ విగ్రహం తరలింపు





**మే 28న మైత్రీవనం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరణ**

**కొత్తపేట,పెన్ పవర్,మే 25:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట వడియార్ శిల్పశాలలో రూపొందిన నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహాన్ని ఆదివారం హైదరాబాద్‌కు తరలించారు. ప్రముఖ కళాశిల్పి, కళారత్న డి. రాజ్‌కుమార్ ఉడయార్ రెండు నెలల పాటు శ్రమించి ఈ విగ్రహాన్ని రూపొందించారు. 23 అడుగుల ఎత్తుతో సజీవ రూపంలో తయారైన ఈ విగ్రహం హైదరాబాద్ నగర నడిబొడ్డున అమీర్‌పేట మైత్రీవనం కూడలిలో ప్రతిష్ఠించనున్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈ నెల 28న తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న తొలి ఎన్టీఆర్ విగ్రహం కావడం విశేషంగా మారింది.కొత్తపేట వడియార్ శిల్పశాల నుంచి క్రేన్ సహాయంతో విగ్రహాన్ని ప్రత్యేక లారీలో హైదరాబాద్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంఠంశెట్టి శ్రీను, గుబ్బల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ ఆధారిత పంటల సాగు ఉత్తమం....



**శంఖవరం మే 25 పెన్ పవర్ :-** ఈ తొలకరి పంట కాలంలో ఎల్నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నశీదున రైతులు పంటల సాగు ప్రణాళికలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తంలో భాగంగా జి కొత్తపల్లి, గౌరంపేట పరిధిలోని గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి తొలకరి పంటల సాగులో భాగంగా వేసవి దుక్కులు అవశ్యకత,
పి ఎం డి ఎస్ విత్తనాల ప్రాధాన్యత, వరిలో రకాలు,పంటల భీమా పథకం,పంట నమోదు,కౌలు పత్రాల అవశ్యకత, ఆరుతడి పంటల సాగు,ఎరువుల వాడకం, రాయితీపై యంత్ర పరికరాలు, ఉద్యాన పంటల సాగు మరియు రాయితీలు, రాయితీపై పశు గ్రాస విత్తనాలు వంటి అంశాలపై చర్చించారు. ఏ ఈ ఓ శ్రీనివాస్, సెక్రటరీ , ఉద్యాన, పశువైద్య సహాయకులు శ్యామ్ సుందర్,సత్యనారాయణ, భవాని,గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యా చైతన్యమే జాతి అభ్యున్నతికి మార్గం : ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ



**ఆత్రేయపురం పెన్ పవర్ మే 25:** మండలంలో లొల్ల లాకులు వద్ద ఎ.ఆర్.పి.ఎస్., ఎం.ఎస్.పి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి 40 రోజుల "గో టు విలేజ్" సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి పొలిట్ బ్యూరో సభ్యులు ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ హాజరై మాట్లాడారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించిన ఎస్సీ వర్గీకరణ ఫలాలు భవిష్యత్ తరాలకు అందాలంటే విద్యా, ఉద్యోగ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగ సమాజంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటం వల్లే సమాజం వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులు చిన్న చిన్న ఆర్థిక సమస్యలతో చదువులు మానేయకుండా ఎమ్మార్పీఎస్ శ్రేణులు గ్రామాల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. చదువే సమాజ విముక్తికి ఆయుధమని, యువత విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.గో టు విలేజ్" కార్యక్రమాన్ని 40 రోజుల పాటు విద్యా ప్రాముఖ్యత మాసాలుగా నిర్వహించి గ్రామాల్లో తల్లిదండ్రులు, విద్యార్థులను చైతన్యపరిచేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు. అలాగే జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవ మూర్తి మాదిగ, ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ, కాపా నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచేందుకు మెర్లపాలెంలో ప్రత్యేక విద్యా చైతన్య యాత్ర






**ఆత్రేయపురం పెన్ పవర్ మే 25**:విద్యార్థుల చేరికలను గణనీయంగా పెంచి ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా ఉన్నత పాఠశాల మెర్లపాలెం ఆధ్వర్యంలో సోమవారం గ్రామవ్యాప్తంగా ప్రత్యేక అవగాహన క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో మంచి స్పందనను రాబట్టింది.
పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.వి సత్యనారాయణ నాయకత్వంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్ద కొమ్మర రాఘవతో పాటు పలువురు ప్రముఖులు ఈ చైతన్య కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి వీధిలో ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సదుపాయాలను వివరించారు.
ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ తరగతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.
ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని" కోరారు.గ్రామ పెద్దలు కూడా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారా మాత్రమే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.క్యాంపెయిన్ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, చదువు మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలకు తీసుకురావడానికి చర్యలు చేపట్టారు.ఈ అవగాహన కార్యక్రమానికి గ్రామ ప్రజలు విశేష స్పందన తెలియజేసి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు రావడం విశేషం.

# రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం కావాలి.

–రైతులకు అవగాహనా కార్యక్రమంలో ఏఓ,నాగం సుధామాధురి.

**కిర్లంపూడి, పెన్ పవర్, మే 25**: రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం కావాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి పిలుపునిచ్చారు. సోమవారం కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, జగపతినగరం గ్రామాలలో ఖరీఫ్ సాగు సమాయత్తంపై రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఓ, నాగం సుధామాధురి మాట్లాడుతూ రైతులకు ఎల్ నినో ప్రభావం గురించి వివరించారు. కాలువలు ద్వారా నీరు విడుదలైన వెంటనే రైతులు దమ్ములు చేపట్టి త్వరగా ఆకుమడులు వేసుకోవాలని సూచించారు.ఈ సీజన్ కు వెదజల్లు పద్ధతిలో సాగు చేసుకోకపోవడం మంచిదని తెలియజేశారు. స్వర్ణ,సంపద స్వర్ణ వంటి మధ్య కాలిక రకాలు మాత్రమే రైతులు సాగు చేసుకోవాల్సిందిగా కోరారు.కాకినాడ జిల్లా నేషనల్ ఫర్టిలైజర్స్ ఫ్రేమ్ వర్క్ కింద పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడం వల్ల ఈసారి రైతుకు కావలసిన ఎరువులన్నీ యాప్ ద్వారా రైతులకు అందించడం జరుగుతుందని ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.ప్రతి రైతు విధిగా ఫార్మర్ ఐడి చేయించుకోవాలని, ఫార్మర్ ఐడి ఉంటేనే వ్యవసాయ శాఖ ద్వారా అందించే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత,మంజూష,రమ్య పలువురు రైతులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com